క్లుప్తంగా

టీడీపీకి కోలుకోలేని దెబ్బ



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన దగదర్తి మండలం టీడీపీ నాయకులు

కావలి: దగదర్తి మండలంలో టీడీపీకి చావు దెబ్బ తప్పదని ఎంపీపీ ప్రసాద్‌నాయుడు అన్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి వస్తున్న జనాదరణను చూసి కుటుంబాలకు కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నాయన్నారు. దగదర్తి మండలం పాత ఐతంపాడు, కొత్త ఐతంపాడు, బాడుగులపాడు పంచాయతీల్లో టీడీపీకి చెందిన 30 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ చెందిన డి.చిన్నహజరతయ్య, డి.నాగేశ్వరరావు, డి వీరభద్రయ్య, డి.వెంకటేశ్వర్లు, ఎ.చిన్నబ్బయ్య, ఎ.హజరత్, తిరుపతయ్య, శ్రీహరి, అనిల్, మోహన్, వెంకట రమణయ్య, మాల్యాద్రి, మధు, శ్రీకాంత్, బాల కోటయ్య, మధు, రవి, శివయ్య, కుటుంబాలు టీడీపీ వీడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మహేష్ నాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ శ్రేణులు



పార్టీలో చేరిన వారితో మేకపాటి

ఉదయగిరి: పట్టణంలోని బోయవీధిలో ఆదివారం సాయంత్రం ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో పలువురు టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీలో చేరారు. బోయవీధికి చెందిన చల్లా వెంకటసుబ్బయ్య, నల్లబోతుల సుబ్బారావుల ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 50 కుటుంబాలు పార్టీలో చేరడంతో మేకపాటి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. రోజు రోజుకు పార్టీ పట్ల ప్రజాదరణ పెరిగిపోవడం విజయానికి శుభ సూచికమన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తన ను, ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జి.ఓబుల్‌రెడ్డి, నాయకులు ఎం.వినయ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ముర్తుజాహుస్సేన్, ఏ భాస్కర్‌రెడ్డి, ఎన్.మల్లికార్జున, సునీల్, ఎంఏ సలీం, టింకర్‌బాబు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి: మండలంలోని ఆర్లపడియ పంచాయతీ ఉప్పరపల్లెలో కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివార్లకు ప్రత్యేకంగా తిరుమంజనం నిర్వహించారు. స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

నేత్రపర్వం సీతారాముల కల్యాణం

అల్లూరు: మండలంలోని తుపాన్‌నగర్‌లో కోదండరామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున మంగళ వాయిద్యాలు, బాణసంచాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

జగనన్న పాలనలోనే ప్రతి ఇంటా సంక్షేమ లబ్ధి

ఉదయగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.ఓబుల్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం కృష్ణంపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని ఫ్యాను గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు అక్కి ప్రమీల, గొల్లపల్లి కల్పన, వైస్ ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి, వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్లు అక్కి భాస్కరరెడ్డి, మూలె సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో కాటంరెడ్డి, మన్నెమాల



కందుకూరులో ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కందుకూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

సైకిల్‌ని మడతెట్టేశారు..!

- ఊర్లకు ఊర్లు.. వార్డులకు వార్డుల్లో టీడీపీ ఖాళీ
- సీనియర్ల నుంచి కార్యకర్తల వరకు సైకిల్ దిగేస్తున్న వైనం
- ఫ్యాన్ గాలి కింద సేద తీరుతున్న తమ్ముళ్లు
- ప్రజలే ప్రచార సారథులుగా మారడంతో క్యాడర్‌లో ఉత్సాహం

ఆ త్రిమూర్తులు.. టీడీపీని మడతెట్టేస్తున్నారు. పోలింగ్ తేదీ దగ్గరపడే కొద్దీ గ్రామాలకు గ్రామాలే ఫ్యాన్ కిందకు చేరుతుండటంతో టీడీపీ పూర్తిగా తుడిచి పెట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. మునుపెన్నడూ లేని రీతిలో ఈ సారి టీడీపీ కీలక నాయకులు, సీనియర్ నాయకులు కూడా సైకిల్ దిగేసి వైఎస్సార్‌సీపీలో చేరుతుండటం విశేషం. ఎమ్మెల్యేతో పాటు ఆ త్రిమూర్తులు రాత్రి వరకు ప్రచారంలో తలమునకలై తిరుగుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి టీడీపీ శ్రేణులు వాహనాల్లో వారు ఎక్కడుంటే.. అక్కడికి వెళ్లి వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకుంటున్నారు. అర్ధరాత్రులు అయినా సరే వేచి ఉండి.. వైఎస్సార్‌సీపీలో చేరుతున్న పరిస్థితి కనిపిస్తోంది.



కావలి: కావలి నియోజకవర్గంలో టీడీపీ తుడిచి పెట్టుకుపోతోంది. ఊర్లకు ఊర్లు.. వార్డులకు వార్డులే ఖాళీ అవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో పార్టీకి మూలస్తంభాల్లా పనిచేసే నేతలు, కార్యకర్తలతో పాటు అభిమానులు సైతం సైకిల్ దిగేస్తున్నారు. ఈ పరిణామాలతో టీడీపీ లీడర్లు తలలు పట్టుకుని, ఇంటి నుంచి బయటకురాలేక ముఖం చాటేస్తున్నారు. పోలింగ్ సమీపిస్తుండడంతో వైఎస్సార్‌సీపీలోకి చేరికలు కూడా జోరందుకున్నాయి. టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరే వారితో ఎమ్మెల్యే నివాసం వద్ద ప్రతి రోజూ కోలాహలం కనిపిస్తోంది. మరో వైపు ప్రచారాల్లో ఉంటే.. అక్కడికే వెళ్లి పార్టీలో చేరుతుండడంతో విశేషం. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలనే లక్ష్యంతో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కందుకూరు పరిశీలకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి క్షేత్రస్థాయిలో టీడీపీని మడత పెట్టేస్తున్నారు. గ్రామాలకు గ్రామాలే టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరేలా వీరు పావులు కదుపుతుండటంతో టీడీపీ దాదాపుగా తుడిచి పెట్టుకుపోయింది. టీడీపీకి అంతో ఇంతో ఓట్లు ఉన్న గ్రామాల్లో కూడా పోలింగ్ ఏజెంట్లు దొరికే పరిస్థితి లేకుండా చేశారు. కావలి పట్టణం, రూరల్ మండలాలతో పాటు బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాల నుంచి కూడా ప్రతీరోజూ భారీగా చేరికలు నమోదవుతుండటం విశేషం. ఒక వైపు విస్తృత ప్రచారం నిర్వహిస్తూనే, మరోవైపు చేరికలను ప్రోత్సహించే దిశగా పావులు కదుపుతుండటంతో క్యాడర్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్లతో పాటు రానున్న పారిశ్రామిక కారిడార్‌తో కావలి రూపురేఖలే మారనుండటంతో కావలి బాగుగోరే వాళ్లంతా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. దీంతో క్యాడర్ కూడా ఫుల్‌జోష్‌లో ఉంది.

ప్రచారంలో సరికొత్త రికార్డులు

కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభించిన తర్వాత ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ప్రచార బాధ్యతలన్నీ ప్రజలే స్వచ్ఛందంగా తమ భుజస్కంధాలపై వేసుకుని వేలాదిగా తరలి వస్తుండటం గమనార్హం. నియోజకవర్గానికి ఈశాన్య ప్రాంతంలో ఆనవాయితీ ప్రకారం కావలి మండలం పెద్ద పట్టుపాళెం పంచాయతీలోని సముద్ర తీరంలో ఉన్న నందెమ్మపురంలో ప్రచారం ప్రారంభించిన రోజు నుంచి ప్రతి చోటా సంక్షేమ పథకాల లబ్ధిదారులే స్టార్ క్యాంపెయినర్లుగా పార్టీ జెండాలతో తిరుగుతున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రతి ఇంటి నుంచి ఒక్కొక్కరుగా వచ్చి ప్రచారంలో పాల్గొంటున్నారు. మండుటెండలు, వడగాలులు సైతం లెక్క చేయడం లేదు. ప్రచారం నిర్వహిస్తున్న ప్రతిచోటా భారీ గజమాలలతో స్వాగతం పలుకుతూ పూల వర్షం కురిపిస్తున్నారు. హారతులు, దీవెనలతో విజయం నీదేనంటూ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డిని మనసారా దీవిస్తున్నారు. నామినేషన్ రోజున అయితే ఏకంగా 35 వేల మందికి పైగా కావలికి తరలివచ్చి సరికొత్త చరిత్ర సృష్టించారు. కావలిలోని ఎమ్మెల్యే ఇంటి వద్ద నుంచి కళుగోళమ్మ ఆలయం వరకు సుమారు ఆరు కిలో మీటర్ల మేర జనాలు నిండిపోయారంటే ఎమ్మెల్యేపైన, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పైన ప్రజలకు ఉన్న ఆదరణ, అభిమానాన్ని అర్థం చేసుకోవచ్చు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి నామినేషన్‌కు వచ్చిన జనాలను చూసిన తర్వాత టీడీపీ పూర్తిగా ఆశలు వదిలేసుకుంది. అప్పటి వరకూ ఉత్తరకుమారుని ప్రగల్భాలు పలికిన ఆ పార్టీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి ఆ మరుసటి రోజే ఒంటరిగా నామినేషన్ దాఖలు చేసి ఓటమిని పరోక్షంగా అంగీకరించారు.

సైకిల్ గాలి తీసేస్తున్న తమ్ముళ్లు

నియోజకవర్గంలో ఓటర్లంతా ఏకతాటిపై వచ్చి వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు సిద్ధమవడంతో టీడీపీ క్యాడర్‌లో నిస్తేజం నెలకొంది. టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి వ్యవహారశైలితో క్యాడర్ మొదటి నుంచి వ్యతిరేకిస్తుండగా, అతని నోటి దురుసు చూసినా జనాలు కూడా ప్రారంభంలోనే తిరస్కరించారు. దీంతో కావ్య ప్రచారానికే కాకుండా ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు పట్టణ నడిబొడ్డున నిర్వహించిన ప్రజాగళం సభకు కూడా జనాలు రాకుండా మొహం చాటేశారు. దీంతో ప్రజల కోసం ఏకంగా గంట పాటు చంద్రబాబు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఆ తర్వాత వరుసగా జరుగుతున్న పరిణామాలు, కావ్య మొక్కుబడిగా నామినేషన్ దాఖలు చేయడం, సొంత పార్టీ క్యాడర్ కూడా ప్రచార కార్యక్రమాలకు దూరంగా ఉంటుండటంతో మిత్రపక్షాలు కూడా టీడీపీకి దూరంగా జరిగాయి. కూటమిలోని బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కూడా సైకిల్‌కు ఓటేసేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు.

పతి కోసం సతి ప్రచారం



ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి

కావలి: ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన సతీమణి ఆదిలక్ష్మి ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. మండలంలోని ఆనెమడుగు పంచాయతీలో ఆమె ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆమెకు అడుగడుగున మహిళలు హారతులిస్తూ ఆప్యాయంగా ఆహ్వానించారు. పేదలకు మంచి జరగాలంటే తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలంటే.. స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మామయ్యను గెలిపించండి



జలదంకిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శ్రీయారెడ్డి

జలదంకి: ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కోడలు శ్రీయారెడ్డి ఆదివారం సాయంత్రం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తన మామయ్య రాజగోపాల్‌రెడ్డికి, ఎంపీగా పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డికి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, జిల్లా ప్రచార కార్యదర్శి ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు సురె వెంకటశేషారెడ్డి, కొర్నిపాటి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్నకు తిరిగి పట్టం కట్టండి

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

సీతారామపురం: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓట్లేసి సంక్షేమ రథసారథి జగనన్నకు తిరిగి పట్టం కట్టాలని ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోరారు. ఆయన ఆదివారం మండలంలోని బసినేనిపల్లి, పడమటి రొంపిదొడ్ల, సంజీవరెడ్డినగర్, ఏసీనగర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు ప్రభుత్వ పథకాలను చేర వేసిన ఏకైక ప్రభుత్వం మన జగనన్న ప్రభుత్వమేనన్నారు. ఐదేళ్ల పాలనలో ఇచ్చిన మాట తప్పకుండా హామీలు అమలు చేసిన జగనన్నను ప్రజలు ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు జీవితంలో ఇచ్చిన మాట మీద ఏ నాడూ నిలబడలేదని, అలాంటి మోసగాడిని ముఖ్యమంత్రి చేయడానికి కొంత మంది ప్యాకేజీలతో ప్రజలను మాయ చేయడానికే వచ్చారన్నారు. ఎన్నికలయ్యాక ఒకరు అమెరికాకు, మరొకరు దక్షిణాఫ్రికాకు చెక్కేయడం ఖాయమన్నారు. విశ్వసనీయత, విలువలతో కూడిన మేనిఫెస్టో విడుదల చేసిన జగనన్న మీ ఇంట్లో మంచి జరిగి ఉంటేనే వైఎస్సార్‌సీపీకి ఓటేయాలని కోరుతున్నారన్నారు. సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ కావాలన్నా 1వ తేదీ వృద్ధాప్య, వికలాంగ పింఛన్లు ఇంటి వద్దకే అందాలన్నా వైఎస్సార్‌సీపీకే ఓటేయాలన్నారు. మేకపాటి కుటుంబం నలభై ఏళ్ల నుంచి ఉదయగిరి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని, ఈ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా విజయసాయిరెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తొలుత మేకపాటికి మండల వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు చింతంరెడ్డి లోకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో యువకులు బైక్ ర్యాలీతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, జెడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పీసీ అల్లూరురాజు, బసినేనిపల్లి, గుండుపల్లి, చిన్నాగంపల్లి సర్పంచ్‌లు పల్లె విజయమ్మ, చప్పిడి తిరుపతిరెడ్డి, మునగల రామచంద్రారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి వెంకటనారాయణ, జేసీఎస్ కన్వీనరు మాబయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు దుత్తలూరులో విజయసాయిరెడ్డి రోడ్‌షో

దుత్తలూరు: వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి సోమవారం సాయంత్రం ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి రోడ్‌షో నిర్వహించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి తెలిపారు. ఆదివారం దుత్తలూరులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సోమవారం సాయంత్రం 4 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి దుత్తలూరు మీదుగా సెంటర్ వరకు రోడ్‌షో జరుగుతుందన్నారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఎల్‌పీ కొండారెడ్డి, దొంతిరెడ్డి ఓబుల్‌రెడ్డి, అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, చుండి చైతన్య, సింగవరపు విజయ్, మద్దిరెడ్డి దేవానందం పాల్గొన్నారు.

నేడు కలిగిరిలో విజయసాయిరెడ్డి పర్యటన

కలిగిరి: వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి సోమవారం కలిగిరిలో పర్యటిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి కలిగిరమ్మ తల్లి ఆలయం వద్దకు ర్యాలీ, అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రలోభాలతో ప్రజలకు ఎర వేస్తున్నారు..

- రూ.70 టీ కప్పులు, మద్యం సీసాలు పంపిణీ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: నియోజకవర్గంలో ప్రలోభాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు టీడీపీ నాయకులు దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు రూ.70 ఖరీదైన టీకప్పు సెట్లు, మద్యం సీసాలతో తీరప్రాంత గ్రామాలను ముంచెత్తుతున్నారని ధ్వజమెత్తారు. మే 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ కనీస ఓట్లు కూడా దక్కే పరిస్థితి లేకపోవడంతో డబ్బు, మద్యంపై ఆధారపడి డిపాజిట్లు దక్కించుకునేందుకు ఆరాటపడుతుందని దుయ్యబట్టారు. ప్రజలను మభ్య పెట్టడం, అబద్ధాలతో పబ్బం గడుపుకోవడం టీడీపీకి మొదటి నుంచి అలవాటేనన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు ఇస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందని హేళన చేసిన చంద్రబాబు ఇప్పుడు మాత్రం సూపర్ సిక్స్ అంటూ ఆచరణ సాధ్యం కాని హామీలతో జనం ముందుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. 2014 ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన మేనిఫెస్టోలో ఒక్క హామీని కూడా అమలు చేయలేక ఏకంగా మేనిఫెస్టోని మాయం చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. కావలి నియోజకవర్గంలో రోజుకో చోట మద్యం, టీ కప్పులు, డబ్బులు పంచుతూ పేదలను ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి మే 13న జరిగే ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటేసి ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వేణుంబాక, మేకపాటి పర్యటన

వరికుంటపాడు: మండలంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచార పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ అలి అహ్మద్, సొసైటీ అధ్యక్షుడు జి.రామాంజయులు, మండల కన్వీనర్ ఎం.తిరుపతినాయుడు, నాయకుడు ఎం.శ్రీనివాసులు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు మండలంలోని జడదేవి నుంచి తిమ్మారెడ్డిపల్లె వరకు భారీ బైక్‌ర్యాలీ రోడ్‌షో, ఎన్నికల ప్రచారం జరుగుతుందన్నారు.

వృద్ధాశ్రమ సేవలు ఎనలేనివి



సుబ్బరామ ప్రసాద్‌గుప్త చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లిలో మంచికంటి సుబ్రహ్మణ్యం తన కుమారుడు సుబ్బరామ ప్రసాద్‌గుప్త జ్ఞాపకార్థంగా నిర్మించిన వృద్ధాశ్రమ సేవలు ఎనలేనివని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం ఆశ్రయ ఆరవ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. సుబ్రహ్మణ్యం పుట్టిన గ్రామంలో కుమారుడి గుర్తుగా అభాగ్యుల కోసం వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి వారికి మూడుపూటలా కూడు, గూడు వసతులు కల్పిస్తూ పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ గతంలో తాము ఆస్పత్రి కోసం స్థలం కేటాయించామని, ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గెలిచిన తర్వాత ఆ స్థలంలో ఆస్పత్రి భవనం నిర్మించాలని కోరారు. అనంతరం సుబ్బరామ ప్రసాద్‌గుప్త చిత్రటం వద్ద నివాళులర్పించారు. ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు గురవారెడ్డి, సుబ్బారెడ్డి, అల్లూరురాజు, ఆశ్రమ నిర్వాహకులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కావ్యకు ఓటేస్తే.. కావలిని అమ్మేస్తాడు

- నియోజకవర్గ పరిశీలకుడు చేజర్ల సుబ్బారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న చేజర్ల సుబ్బారెడ్డి

కావలి: టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డికి ఓటేస్తే నియోజకవర్గాన్ని నిలువునా అమ్మకానికి పెడుతాడని వైఎస్సార్‌సీపీ కావలి నియోజకవర్గ పరిశీలకులు చేజర్ల సుబ్బారెడ్డి అన్నారు. సుబ్బారెడ్డి ఆదివారం ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన కావ్య కృష్ణారెడ్డి స్థానిక ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి సాగించిన అరాచకాలను గణాంకాలతో సహా వివరించారు. అధికార యంత్రాంగాన్ని గుప్పెట్లో పెట్టుకునేందుకు చంద్రశేఖర్‌రెడ్డిని వ్యాపార భాగస్వామిగా చేసుకుని క్వారీల పేరుతో ఉదయగిరిని గుల్లగుల్లగా చేశారని ఆరోపించారు. ప్రభుత్వానికి పన్నులు కూడా చెల్లించకుండా పరిమితులకు మించి తవ్వకాలు సాగించారని తెలిపారు. జలదంకి మండలం అన్నవరంలో స్థానికులను బెదిరించి క్వారీల పేరుతో భూములు లాక్కున్న విషయాన్ని గుర్తు చేశారు. మైనింగ్ అధికారులు ఏకంగా రూ.140 కోట్లు పెనాల్టీ విధిస్తే కోర్టును ఆశ్రయించి తాత్కాలికంగా తప్పించుకున్నాడని తెలిపారు. ఇటువంటి వ్యక్తికి ఓటేస్తే కావలిని కూడా అతిత్వరలో అమ్మకానికి పెడుతాడని హెచ్చరించారు. అధికారం కోసం, అడ్డగోలు సంపాదన కోసం సీజనల్‌గా వచ్చిపోయే ఇటువంటి వ్యక్తుల విషయంలో కావలి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి అండగా నిలిచి మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీకే ఆర్యవైశ్యుల మద్దతు

- వ్యాపారులకు ప్రతాపన్నే అండగా నిలిచారు..
- ఆర్యవైశ్యులకు గుర్తింపు తెచ్చారు..
- వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కనుమర్లపూడి వెంకటనారాయణ



మాట్లాడుతున్న వెంకటనారాయణ

కావలి: కావలి నియోజకవర్గంలోనే కాదు.. రాష్ట్రమంతా ఆర్యవైశ్యుల మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉందని వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కనుమర్లపూడి వెంకటనారాయణ అన్నారు. గడిచిన ఐదేళ్లుగా కావలిలో ఆర్యవైశ్యులకు అండగా నిలిచింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాత్రమేనని కావలిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పదేళ్లుగా కావలి పట్టణంలో వ్యాపారులంతా ఎటువంటి ఒత్తిళ్లు, మామూళ్ల బెడద లేకుండా వ్యాపారాలు చేసుకుంటున్నారంటే అందుకు ఎమ్మెల్యే ప్రతాపన్న సహకారమే కారణమన్నారు. వ్యాపార రంగం వృద్ధి చెందితే పట్టణం కూడా అభివృద్ధి చెందుతుందనే నమ్మే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆర్యవైశ్యులకు అండగా నిలిచి, వ్యాపారులకు ఏదైనా సమస్య వస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడు సమస్య పరిష్కరించేవారన్నారు. వస్త్ర వ్యాపారంలో అగ్రగామిగా ఉన్న కావలిలో పండగల సీజన్‌లో బయట నుంచి వ్యాపారులు వచ్చి తాత్కాలిక షోరూంల ఏర్పాటు ద్వారా స్థానిక వ్యాపారులకు గండి కొట్టాలని ప్రయత్నిస్తే అడ్డుకుంది కూడా ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాత్రమేనని గుర్తు చేశారు. తోపుడు బండ్ల వ్యాపారులకు కూడా ఎమ్మెల్యే అండగా నిలిచి మున్సిపాలిటీ అధికారుల నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూశారని తెలిపారు. కోవిడ్ లాక్‌డౌన్ టైంలో వ్యాపారులంతా ఇబ్బంది పడుతుంటే ఎమ్మెల్యేనే అధికారులతో చర్చించి వ్యాపారాలకు సమయం కేటాయించడంతో పాటు కోవిడ్ బారిన పడిన వ్యాపారులకు సొంత డబ్బుతో చికిత్స చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. కావలిని కనకపట్నంగా అభివృద్ధి పథంలో నిలబెట్టే క్రమంలో ఇప్పటికే రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్ సాధించారని ఎన్నికల తర్వాత పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగాలు, వ్యాపారాలు పెరుగుతాయన్నారు. తద్వారా కావలిలో వ్యాపారులు పెరుగుతాయన్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికే రానున్న ఎన్నికల్లో పార్టీలకతీతంగా ఆర్యవైశ్యులంతా మద్దతు తెలపనున్నట్లు ప్రకటించారు.

శ్రీరాం మాల్యాద్రి తీరు తీవ్ర గర్హనీయం

కావలి ఆర్యవైశ్య నేతగా చెప్పుకుంటూ ఐదేళ్ల పాటు కొండబిట్రగుంట ఆలయ కమిటీ చైర్మన్ హోదా అనుభవించిన శ్రీరాం మాల్యాద్రి తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిన చందంగా వ్యవహరించడం తీవ్ర గర్హనీయమని కావలి పట్టణ ఆర్యవైశ సీనియర్ నేత వీఎంఎస్ఆర్ మాలి అన్నారు. కావలిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్యవైశ్యులకు, వ్యాపారులకు ప్రాధాన్యత ఇవ్వాలనే సదుద్దేశంతో బిలకూట క్షేత్రానికి శ్రీరాం మాల్యాద్రిని రెండు దఫాలుగా ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి నియమించారని గుర్తు చేశారు. ఇదే టీడీపీ గతంలో ఏనాడైనా ఆర్యవైశ్యులను గుర్తించి ఇలాంటి పదవులు కట్టబెట్టిందా? అని ప్రశ్నించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఆర్యవైశ్యులపై అభిమానంతో శ్రీరాం మాల్యాద్రికి గుర్తింపు ఇచ్చి ఆర్యవైశ్యులను గౌరవిస్తే.. ఎన్నికల సమయంలో టీడీపీ పంచన చేరి నమ్మక ద్రోహానికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. ఆర్యవైశ్యులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాత్రమేనని, మే 13న జరిగే ఎన్నికల్లో ఆర్యవైశ్యులంతా ఆయనకు అండగా నిలబడి రుణం తీర్చుకుంటామని తెలిపారు.

శ్రీరాం మాల్యాద్రి నిర్ణయం బాధాకరం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి ఆర్యవైశ్య నేత, కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి వైఎస్సార్‌సీపీని వీడడం బాధాకరమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బిలకూట క్షేత్రం అభివృద్ధి కోసం రెండు దఫాలుగా శ్రీరాం మాల్యాద్రిని ఆలయ కమిటీ చైర్మన్‌గా నియమించినట్లు తెలిపారు. శ్రీరాం మాల్యాద్రి సారథ్యంలో కొండబిట్రగుంటను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. మూడో సారి కూడా శ్రీరాం మాల్యాద్రినే చైర్మన్‌గా కొనసాగించి బిలకూట క్షేత్రం ఆధునికీకరణ విజయవంతంగా పూర్తి చేయించాలని భావించానని, ఇంతలోనే పార్టీ మారడం బాధ కలిగించిందన్నారు. ఆర్యవైశ్యులను గౌరవించాలనే భావించే శ్రీరాం మాల్యాద్రికి ప్రతిష్టాత్మకమైన పదవిలో కూర్చొబెట్టామన్నారు.

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



నెల్లూరు(వేదాయపాళెం): జిల్లా విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ కాలనీ ఎదురుగా జాతీయ రహదారిపై మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఖజానా వెంకటశేషయ్య ఆచారి, 47 డివిజన్ కార్పొరేటర్ పొట్లూరు రామకృష్ణ చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటశేషయ్య ఆచారి మాట్లాడుతూ నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి సహకారంతో విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీకి కేటాయించిన 25 సెంట్ల స్థలంలో చలివేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. వేసవి పూర్తయ్యే వరకు చలివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి సురేష్‌ఆచారి, కోశాధికారి ఏలూరు బాబు, నాయకులు రఘురామయ్య, చంద్ర, రామ్మూర్తి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు దంత పరీక్షలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్మైల్ డెంటల్ హాస్పిటల్ సౌజన్యంతో వాకర్స్‌కు ఆదివారం దంత పరీక్షలు నిర్వహించారు. దంత వైద్యులు భవాని, యజ్ఞప్రియ వాకర్స్‌కు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డీవీ సుబ్బరాజు, ఎస్ రమేష్‌బాబు, అసోసియేషన్ వ్యవస్థాపకులు నరేంద్రరెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు



వేణుగోపాలుడికి చక్రస్నానం జరుపుతున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు ఉదయం బ్రహ్మోత్సవాలతో అలిసిపోయిన వేణుగోపాలుడికి చక్ర స్నానాన్ని నిర్వహించారు. రాత్రి రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలుడ్ని విశేషంగా అలంకరించి ఏకాంతసేవను వేడుకగా నిర్వహించారు. చక్రస్నానానికి విరుపావఝుల గిరికృష్ణ, సంయుక్త దంపతులు, ఏకాంత సేవకు నన్నపురెడ్డి సుకన్య, నన్నపురెడ్డి సుధాకర్ రెడ్డి, సుమన వ్యవహరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ గిరికృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న లక్ష్మణ్‌సింగ్

నెల్లూరు(బృందావనం): జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణే తమ సంస్థ ధ్యేయమని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ (ఏఐహెచ్ఆర్) సంస్థ జిల్లా చీఫ్ చౌహాన్ లక్ష్మణ్‌సింగ్ తెలిపారు. మూలాపేటలోని ఏఐహెచ్ఆర్ కార్యాలయంలో నూతన సభ్యులకు ఆదివారం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ పడవల సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌సింగ్ మాట్లాడుతూ 1987లో అప్పటి భారత రాష్ట్రపతి జ్ఞానీజైల్‌సింగ్ ఏఐహెచ్ఆర్ సంస్థను స్థాపించారని తెలిపారు. ఆసియా ఖండంలోనే ప్రధానమైన మానవహక్కుల పరిరక్షణ సంస్థగా ఏఐహెచ్ఆర్ పేరు ప్రతిష్టలు గడించిందని వివరించారు. ప్రస్తుతం సంస్థ అధ్యక్షుడిగా ఎంయూ దువా, ప్యాట్రన్ చీఫ్‌గా సుప్రీంకోర్టు జస్టిస్ వీఎస్ సిర్పూర్కర్ కొనసాగుతున్నారని తెలిపారు. గత మూడున్నర దశాబ్దాలుగా మానవ హక్కుల పరిరక్షణకు సంస్థ అందించిన సేవలు ఎనలేనివన్నారు. మానవ హక్కులకు ఎలాంటి ఉల్లంఘన జరిగినా తమ దృష్టికి తీసుకొస్తే న్యాయం కోసం కృషి చేస్తామన్నారు. జిల్లా చీఫ్ ప్యాట్రన్ ఎద్దల రామచంద్రారెడ్డి, సభ్యులు మురళీకృష్ణ, యోగేంద్రనాథ్, శ్రీనివాసులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



ఉలవపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

• ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

చేజర్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలకు మరింత లబ్ధి చేకూరేలా మేనిఫెస్టోను రూపొందించి విడుదల చేశారని, తద్వారా రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన కొనసాగనుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చేజర్ల మండలం తిమ్మాయపాళెం, ఉలవపల్లి, పుట్టుపల్లి, ఓబులాయపల్లి, కొండరాయుడు కండ్రిక, పాతపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా, ఎలాంటి సిఫార్సులు లేకుండా రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు నవరత్నాల పథకాలు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని తెలిపారు. అన్నివర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకుసాగుతున్న ముఖ్యమంత్రి ప్రజలంతా మద్దతుగా నిలిచి మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరించారు.

చంద్రబాబును నమ్మొద్దు

వెన్నుపోట్లు, అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసే టీడీపీ అధినేత చంద్రబాబును నమ్మవద్దని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రజలకు సూచించారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు చేసిన అరాచకాలను ప్రజలు గుర్తుచేసుకోవాలని, ఎన్నికలవేళ మాయమాటలు చెప్పే టీడీపీ నేతలను నమ్మవద్దని, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం కొనసాగింపు సాధ్యమవుతుందని తెలిపారు. రానున్న ఐదేళ్లల్లో ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా జగనన్న మేనిఫెస్టోను రూపొందించి విడుదల చేశారని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అందించిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి, ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలగంగాధర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి మన్యం కిషోర్‌రెడ్డి, నాయకులు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పి.రామమనోహర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పఠాన్ హసన్‌బాషా, షేక్ మునీర్‌బాషా, ఉలవపల్లి మాజీ సర్పంచ్ ఉన్నీషా, డి.నర్సింహులు, ఎస్కే షరీఫ్, దొపాటి రవీంద్రనాయుడు, రత్నారెడ్డి, రఫి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సోమశిల: మండలంలోని అనంతసాగరం, సోమశిల, పడమటికంభంపాడు పంచాయతీల పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతసాగరం పంచాయతీ పరిధిలోని బీసీకాలనీ, త్యాగరాజుకాలనీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు సద్దా రవీంద్రరెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలన గురించి వివరించారు. ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పడమటికంభంపాడులో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని గ్రామస్తులను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎద్దుల శ్రీనివాసులురెడ్డి, ఎన్.పెంచలరెడ్డి, ఎస్.కొండారెడ్డి, సీహెచ్ శ్రీనివాసులురెడి, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆదరించండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనుమసముద్రంపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏఎస్‌పేట మండలం రాజవోలులో జేసీఎస్ కన్వీనర్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు మరో ఐదేళ్లపాటు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని తెలిపారు. రానున్న ఐదేళ్లలో ప్రజలకు సంక్షేమ పథకాలను మరింత మెరుగ్గా అందించేందుకు ముఖ్యమంత్రి మేనిఫెస్టోను రూపకల్పన చేశారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ఈ మేనిఫెస్టో ఉందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సూరా శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటరమణయ్య, రామకృష్ణారెడ్డి, గొల్లప్రోలు శ్రీనివాసులు తెలిపారు.

అత్యధిక మెజారిటీతో గెలిపిద్దాం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రాపూరు వెంకటసుబ్బారెడ్డి తదితరులు

సోమశిల: అనంతసాగరం మండలం ముస్తాపురం గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాపూరు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన గ్రామంలోని గడప గడపకు వెళ్లి జగనన్న ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించి మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, బొమ్మవరం సర్పంచ్ లక్ష్మీదేవి, సచివాలయ కన్వీనర్లు విష్ణువర్ధన్, మాజీ సర్పంచ్ మస్తాన్, నాయకులు మహబూబ్ మస్తాన్, సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ సేవలు ఎనలేనివి



సుబ్బరామ ప్రసాద్‌గుప్త చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లిలో మంచికంటి సుబ్రహ్మణ్యం తన కుమారుడు సుబ్బరామ ప్రసాద్‌గుప్త జ్ఞాపకార్థంగా నిర్మించిన వృద్ధాశ్రమ సేవలు ఎనలేనివని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం ఆశ్రయ ఆరవ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. సుబ్రహ్మణ్యం పుట్టిన గ్రామంలో కుమారుడి గుర్తుగా అభాగ్యుల కోసం వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి వారికి మూడుపూటలా కూడు, గూడు వసతులు కల్పిస్తూ పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ గతంలో తాము ఆస్పత్రి కోసం స్థలం కేటాయించామని, ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్ రెడ్డి గెలిచిన తర్వాత ఆ స్థలంలో ఆస్పత్రి భవనం నిర్మించాలని కోరారు. అనంతరం సుబ్బరామ ప్రసాద్‌గుప్త చిత్రటం వద్ద నివాళులర్పించారు. ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు గురవారెడ్డి, సుబ్బారెడ్డి, అల్లూరురాజు, ఆశ్రమ నిర్వాహకులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

మే 26న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ఉన్న డీఎస్సార్ కల్యాణ మండపంలో మే 26న ఆరో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్ ఆదివారం తెలిపారు. అఖిల భారత బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రా సమాఖ్య, ఆంధ్రప్రదేశ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి సంయుక్త సహకారంతో వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వివాహ పరిచయ వేదికకు వచ్చే వారు మే 5లోగా అడ్వాన్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 98484 86599, 79013 54004 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు



సోమశిల: అనంతసాగరం మండలంలోని రేవూరు, అనంతసాగరంలలో ఆదివారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు కె.నాగమల్లేశ్వరరెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎ.రేఖ తమ సిబ్బందితో కలిసి మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండలంలోని మద్యం దుకాణాల్లో స్టాకును పరిశీలించారు.

ఓటుహక్కుపై వాకర్స్‌కు అవగాహన



అవగాహన కల్పిస్తున్న స్వీప్ సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వీప్ ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్‌కు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ స్వీప్ నోడల్ ఆఫీసర్ వెంకటరత్నం మాట్లాడుతూ ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో చదువుకున్న యువకులు మిగతా వారికి ఓటుహక్కుపై అవగాహన కల్పించాలన్నారు. అవినీతిరహిత ప్రభుత్వం, మంచి పరిపాలన కావాలంటే ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో స్వీప్ సభ్యులు రవి శంకర్‌రెడ్డి, మల్లీశ్వర్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'మానవ సేవే మాధవ సేవ' సేవలు అభినందనీయం

నెల్లూరు(బృందావనం): మానవ సేవే మాధవ సేవ బృందం చేపడుతున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు కొనియాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులతో ఏర్పాటైన 'మానవసేవే మాధవ సేవ' బృందం సభ్యులు, విశ్రాంత ప్రభుత్వ వైద్యులు రావిప్రోలు ఇందిర తన మనువరాలు అక్షయశ్రీ పుట్టిన రోజు వేడుకలను కొండాయపాళెం రోడ్డులోని జనహిత-వాత్సల్య ఆశ్రమంలో ఆదివారం నిర్వహించారు. కేక్ కట్ చేసి చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు. అలాగే పబ్లిక్ హెల్త్‌నర్సు పర్వత ప్రఫుల్లా ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడుతూ గత కొనేళ్లుగా ఆశ్రమానికి తమ బృందం సభ్యులు అందిస్తున్న సేవలను వివరించారు. ప్రభుత్వ వైద్యులు జిజియాబాయి, షాలిని, డాక్టర్ మున్వర్‌సుల్తానా, అక్షయశ్రీ, ,ప్రఫుల్లా, అరవ పరిమళ, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు జీవీ ఫుల్లారెడ్డి, రాఘవ విశ్వనాథం, విజయమ్మ, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లారీ క్యాబిన్ దగ్ధం

నెల్లూరు(క్రైమ్): జాతీయరహదారిపై వెళ్తున్న లారీలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగడం క్యాబిన్ దగ్ధమైంది. వివరాలు..గుంటూరు జిల్లా నుంచి నెల్లూరుకు ఆదివారం సిమెంట్ లోడుతో బయలుదేరిన లారీ జాతీయరహదారిపై ఉన్న ఏ-1 హోటల్ వద్దకు రాగానే బ్యాటరీ వద్ద షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని గమనించిన లారీ డ్రైవర్ కిందకు దిగి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో లారీ క్యాబిన్ దగ్ధమైంది.

చల్లని దీవెనలు అందించండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మణిమంజరి

ఆత్మకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు నిండు మనస్సుతో ఓటు వేసి చల్లని దీవెనలు అందించాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తల్లి మణిమంజరి కోరారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో ఆదివారం సాయంత్రం ఆమె వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలను అందజేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలును వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొందరు ప్రలోభాలకు గురై పార్టీ మారినా ప్రజలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే మద్దతుగా నిలిస్తున్నారని తెలిపారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, వార్డు ఇన్‌చార్జి షేక్ రహీం, గంధళ్ల లక్ష్మి, కౌన్సిలర్లు పి.పెంచలయ్య, తిరుపతమ్మ, శివకోటారెడ్డి, మహబూబ్‌బాషా, నోటి విజయజ్యోతి, గుడి సంధ్య, కల్పన, కొండా చిన వెంకటేశ్వర్లు, తుమ్మల త్రివేణి, పూనూరు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికే ప్రజల మద్దతు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

• వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

ఆత్మకూరురూరల్: మండలంలోని పడకండ్ల పంచాయతీలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గండ్లవేడుకు చెందిన ప్రవాస భారతీయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొల్లి అఖిల్‌నాయుడు ఆధ్వర్యంలో నెల్లూరులో ఎమ్మెల్యే మేకపాటి క్యాంప్ కార్యాలయంలో పడకండ్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు 250 మందికిపైగా వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్న కుటుంబాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరేందుకు తరలిరావడం సంతోషకరమన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన మేనిఫెస్టో సంక్షేమానికి అద్దంపట్టేలా ఉందని తెలిపారు. పడకండ్ల పంచాయతీలోని గ్రామాలతోపాటు చుట్టుపక్కల ఉన్న మరో 30 గ్రామాలకు రాకపోకల కోసం వెన్నవాడ-గండ్లవేడు మధ్య బొగ్గేరుపై రూ.9.5 కోట్ల వ్యయంతో కాజ్‌వే నిర్మాణంతోపాటు సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు టెండర్లు పూర్తి చేసి ప్రారంభించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాగే పడకండ్ల పంచాయతీ పరిధిలోని ప్రజలు కోరిన విధంగా రానున్న ఐదేళ్లలో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లి దొరస్వామినాయుడు, దాడి శ్రీనివాసులు నాయుడుతోపాటు యర్రబల్లి నుంచి ఉలవ రాఘవులు, పాశం వెంకటరమణయ్య, కరణం వెంకటసుబ్బయ్య, భీమవరం మనోహర్, బొటికర్లపాడు నుంచి పాశం వెంకటరత్నం, పులివర్తి కార్తీక్, బొర్రా జయరాములు, గంగపట్ల పెంచలయ్య, షేక్ నాయబ్‌రసూల్, షేక్ హుస్సేనయ్య, పడకండ్ల నుంచి కొమర చెంచు రామయ్య, సింగారెడ్డి రమణారెడ్డి, నరమాల వేణు, పెమ్మసాని గజేంద్రనాయుడు, అన్నం నాగేశ్వరరావు, గుర్రాల పెంచలయ్య, ఉదయగిరి వెంకటేశ్వర్లు, ఐతా నరసింహులు పాల్గొన్నారు. పడకండ్ల సర్పంచ్ మాముడూరు నరసింహులు కుటుంబసభ్యులు పెంచలయ్య, వంగపాటి సీతమ్మ, దుగ్గంపాటి శ్రీను, వెంకటేశ్వర్లు, కొత్త శ్రీనుతోపాటు పంచాయతీ పరిధిలోని మహిళలు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



ఏకాంత సేవలో సీతారాములు



సీతారాముల గ్రామోత్సవం

మనుబోలు : శ్రీరామ నవమిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని పడమటి వీధి రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని శనివారం అర్ధరాత్రి కమనీయంగా నిర్వహించారు. ముందుగా అర్చకుడు సుబ్రహ్మణ్యం శర్మ సీతారాములకు పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. విశేష పూజల చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. వేదమంత్రోచ్చారణలతో మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం నవ దంపతులను భక్తులు భుజాలపై మోస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు సీతారాములకు కొబ్బరికాయలు, పండ్లు పూలతో మంగళ హారతులు పట్టారు.

సీతారాములకు ఏకాంత సేవ

కోదండరామపురంలోని కోదండరాముని ఆలయంలో సీతారాముల ఏకాంత సేవను శనివారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. అర్చకుడు సాయి శర్మ వేదమంత్రోచ్చారణల మధ్య నవ దంపతులైన సీతారాములకు అభిషేకాలు చేసి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. తొమ్మిది రకాల పండ్లు, తొమ్మిది రకాల స్వీట్లను స్వామి దంపతులకు నైవేద్యంగా ఉంచి శాస్త్రోక్తంగా ఏకాంత సేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా దువ్వూరు సుబ్బారెడ్డి, ప్రసన్న దంపతులు వ్యవహరించారు.

హైవేపై ముమ్మరంగా తనిఖీలు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి

మనుబోలు : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మండల పరిధిలోని జాతీయ రహదారి, ఇతర రహదారి మార్గాల్లో అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ప్రేమలత జాతీయ రహదారిపై పొదలకూరు క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నగదు, వస్తువులను పెద్ద ఎత్తున అక్రమంగా తరలిస్తుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రూ.50 వేలకు మించి నగదు, అధిక సంఖ్యలో వస్తువులు ఉంటే వాటికి సంబంధించి బిల్లులు చూపాల్సి ఉంటుందన్నారు. ఆమె వెంట కానిస్టేబుల్ రాజారామ్ ఉన్నారు.